

2

## అడవిని కాపాడదాం.. వన్యప్రాణులను రక్షిద్దాం

- వన్యప్రాణుల రక్షణ మన అందరి బాధ్యత
- ప్లాస్టిక్‌తో మూగజీవాలకు ముప్పు


# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

బుధవారం | 4 మార్చి 2026 | 09 పేజీలు




6

## కంది రైతుపై..
# దళారీ.. సవారీ..!



విక్రయానికి సిద్ధంగా కందులు, మరికొన్ని చోట్ల కోతకు వచ్చిన కంది పంట

ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

- పరేషాన్‌లో కంది రైతులు
- పంట చేతికొచ్చిన దశలో.. పడిపోతున్న కంది ధరలు
- గత నెలలో క్వింటాలకు రూ.9వేలు పలికిన ధర
- ఇప్పుడు ఒక్కసారిగా రూ.7వేలకు పతనం
- సిండికేట్‌గా మారి కంది రైతులను నిండా ముంచుతున్న వ్యాపారులు
- కొనుగోలు కేంద్రాల్లో దళారుల దందా
- ప్రైవేటు వ్యాపారులకు విక్రయించి నష్టపోతున్న రైతులు
- పేరుకే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- అకాల వర్షాలతో ఇప్పటికే తగ్గిన దిగుబడి
- ఇప్పుడు గిట్టుబాటు లేక ఆందోళన

జిల్లాలో కంది రైతులకు రంది పట్టుకుంది. పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులకు తిప్పలు తప్పడం లేదు. రైతులకు దన్నుగా నిలవాల్సిన ప్రభుత్వం పట్టించుకోనట్లుగా వ్యవహనిస్తున్నది. పంట సాగు మొదలు.. పంట అమ్మకం వరకు రైతులకు ఇబ్బందులే ఎదువుతున్నాయి. పంట పండించడం రైతుకు ఒక ఎత్తయితే.. ఆ పంటను అమ్ముకోవడానికి రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఆరుగాలం కష్టపడి పండించిన కంది పంట చేతికి వచ్చినా రైతులకు సంతోషం లేకుండా పోయింది. ఒక్కసారిగా కంది రైతుల ఆశలు అడియాశలయ్యాయి. ఆకాశంలో ఉన్న ధరలు అమాంతం పాతాళానికి పడి పోవడంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. గత నెలలో క్విం టాలుకు రూ.9 వేలు.. ఇప్పుడు రూ.7 వేలకు పతన మైంది. మార్కెట్లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఊసే లేకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు ఆదును చూసి దెబ్బ కొడుతున్నారు. నాణ్యత సాకుతో ధరను భారీగా కోత విధిస్తూ సిండికేట్ గా మారి దందా సాగిస్తున్నారు. అప్పులు తీర్చి గట్టెక్కుదామను కున్న రైతులకు ఇప్పుడు పెట్టుబడి కూడా వచ్చేలా లేదు.



6

### 99 రోజుల
## ప్రగతి ప్రస్థానం

- మార్చి 6 నుంచే 'ప్రజా పాలన'కు శ్రీకారం!
- ఐదు దశల్లో కార్యాచరణ
- 10 అంశాలపై ఫోకస్..
- జూన్ 12 వరకు కొనసాగనున్న బృహత్తర ప్రణాళిక
- సచివాలయంలో కలెక్టర్లతో సదస్సు
- అధికారులకు దిశానిర్దేశం చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- ఆరోగ్యం, స్వచ్ఛత నుంచి శాఖల వారీగా లక్ష్యాలు
- పనుల పర్యవేక్షణకు ప్రత్యేక మొబైల్ యాప్ ప్రారంభం
- ఏప్రిల్ 2న గ్రామ సభలు
- జూన్ 2న ముగింపు

ఈ నెల (మార్చి) 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికను అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో జిల్లా కలెక్టర్ల సదస్సు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రణాళిక శాఖ నోడల్ విభాగంగా వ్యవహరించే ఈ బృహత్తర కార్యక్రమాన్ని ఐదు దశల్లో నిర్వహించనున్నాట్లు తెలిపారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2న గ్రామ సభలు, ఏప్రిల్ 16న మండల స్థాయి కార్యక్రమాలు, మే 2న నియోజకవర్గ స్థాయి, మే 22న జిల్లా స్థాయి సమావేశాలను నిర్వహించాలని, జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలతో ఈ కార్యక్రమం ముగియనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.



8

## ఆనందకేళి రంగేళి

- వసంత వేళ.. రంగుల హేల
- వైభవంగా హోలీ వేడుకలు
- రంగుల జాతరలో తడిసిముద్దయిన జనం
- పల్లెల్లో పండుగ జోరు
- కామదహనంతో మొదలైన పండగ
- గిరిజన గడ్డపై మిన్నంటిన సంబరాలు
- చిన్నా పెద్దా తేడా లేకుండా హోలీ సంబరాల్లో జనం
- డప్పు చప్పుళ్లతో మార్మోగిన పురవీధులు
- ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీసుల బందోబస్తు

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నారులు, యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వాడవాడలా రంగులు చల్లుకుంటూ కేరింతలతో నృత్యం చేస్తూ ఉల్లాసంగా గడిపారు. హోలీ వేడుకల్లో ఆచార వ్యవహారాలతో బంజరా నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పర్యావరణ హితంగా ఈసారి ఎక్కువ మంది సహజసిద్ధమైన రంగులతో వేడుకలు జరుపుకోవడం విశేషం.

### గోదావరి పుష్కర ఘాట్ వద్ద
## పకడ్బందీ ఏర్పాట్లు

- ఏర్పాట్లను పరిశీలించిన పెద్దపల్లి డీసీపీ రాంరెడ్డి
- వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాల కల్పించాలి





### బాల్క సుమన్‌కు
## కోర్టులో ఊరట

- మూడు కేసుల్లోనూ బెయిల్
- బెయిల్ మంజూరు చేసిన చెన్నూర్ న్యాయస్థానం
- ఆదిలాబాద్ జైలు నుంచి నేడు విడుదలయ్యే అవకాశం..

## ఖగోళ అద్భుతం

- ఎరుపు రంగు పులుముకున్న చందమామ
- 'బ్లడ్ మూన్'తో కనువిందు చేసిన చంద్రగ్రహణం!
- 2026 సంవత్సరపు తొలి ఖగోళ అద్భుతం ఆవిష్కారం
- మైమరచి చూసిన ఖగోళ ప్రేమికులు.
- మధ్యాహ్నం 3:20 నుండి సా॥ 6:47 వరకు గ్రహణం

వివరాలు 9లో





ఆరోగ్యశాఖ మంత్రిని కలిసిన

## కౌన్సిలర్ విజయ్ కుమార్

**కాగజ్‌నగర్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**
కాగజ్‌నగర్ మున్సిపల్ కౌన్సిలర్ విజయ్ కుమార్, పట్టణంలో వైద్య సదుపాయాల అభివృద్ధి, ఆసుపత్రుల్లో సిబ్బంది నియామకం, మౌలిక వసతుల సమస్యలపై రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను హైదరాబాద్‌లో కలిసి విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు కౌన్సిలర్ తెలిపారు. సమావేశం పట్టణ ప్రజలకు వైద్య సేవలను మెరుగుపరచడం లక్ష్యంగా జరిగింది.

## అగ్ని ప్రమాదంలో రెండు ఇళ్లు దగ్ధం



**కోటపల్లి, మార్చి 3 (ప్రభాత సమాచారం)**
కోటపల్లి మండలంలోని అన్నారం గ్రామంలో పండగ పూట విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తెప్పాలా సమ్మిరెడ్డికి చెందిన రెండు ఇళ్లు అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో గృహోపకరణాలు, సుమారు లక్ష రూపాయల నగదు, 10 తులాల వెండి ఆభరణాలు, ముఖ్యమైన సర్టిఫికెట్లు కాలిపోయి బూడిదయ్యాయి. సర్వం కోల్పోయిన బాధితులు ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం అందుకున్న కోటపల్లి ఎస్ఐ రాజశేఖర్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ అగ్నిప్రమాదం సంభవించినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. బాధితుడు తెప్పాలా సమ్మిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

ఆర్టీసీ కండక్టర్

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం

**ఉట్నూర్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**
అనారోగ్యంతో మృతి చెందిన ఆర్టీసీ కండక్టర్ అంత్యక్రియలకు ఆ సంస్థ తరఫున ఆర్థిక సహాయం అందించారు. ఉట్నూర్ ఆర్టీసీ డిపో లో కండక్టర్ గా విధులు నిర్వహిస్తున్న వేముల ఉషన్న అనారోగ్యంతో హైదరాబాదులోని ఆర్టీసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఐతే మృతి చెందిన కండక్టర్ ఉషన్న అంత్యక్రియల కోసం సంస్థ తరఫున దహన సంస్కారాలు నిమిత్తం రూ.30 వేల నగదును ఉట్నూర్ ఆర్టీసీ డిపో క్యాషియర్ చంద్రశేఖర్ మృతుని స్వగ్రామం ఇంద్రవెల్లి మండలం కేస్లాగూడ గ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ తరఫున కండక్టర్ కుటుంబానికి అందవలసిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఆయన వారికి తెలిపారు.



# అడవిని కాపాడదాం.. వన్యప్రాణులను రక్షిద్దాం

వన్యప్రాణుల రక్షణ మన అందరి బాధ్యత

ప్లాస్టిక్‌తో మూగజీవాలకు ముప్పు

భీమన్నగుడి చెంత 'క్లీన్ అండ్ గ్రీన్' డ్రైవ్ : ఎఫ్‌డీవో

**కాగజ్‌నగర్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**
కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పరిధిలో బుధవారం ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సిర్పూర్(టి) పెద్దబండ అటవీ ప్రాంతంలో భీమన్నగుడి, అటవీ ప్రాంతంలోని అన్ని నీటి కుంటల వద్ద ప్లాస్టిక్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్.డి.వో అప్పయ్య పాల్గొని, భక్తులు గుడి పరిసరాల్లో అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థపదార్థాలు పారవేసి పరిసరాలు అపరిశుభ్రం చేయకుండా తిరిగి వెళ్ళేటప్పుడు తమవెంట తీసుకెళ్ళి, డంప్ యార్డ్, చెత్త ట్రాక్టర్ లలో గానీ వేయవలసిందిగా కోరారు. ప్లాస్టిక్, ఇతర వ్యర్థపదార్థాలును అక్కడే వదిలివేయడం వల్ల, వాటిని ఆహారంగా తీసుకుని వన్యప్రాణులకు అపాయం కలుగుతుందని ఆయన అన్నారు. అలాగే ఆలయ పరిసర ప్రాంతాల్లో వంట చేసుకునే వారు నిప్పుని అలాగే వదిలి వేయడం వల్ల అడవుల్లో అగ్నిప్రమాదాలు జరిగే ఆస్కారం ఉన్నందున వాటిని పూర్తిగా ఆర్పి ఉందని వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎఫ్ఆర్ఓ ప్రవీణ్ కుమార్, డీఆర్వో శశిధర్ బాబు, సెక్షన్ ఆఫీసర్ అక్తర్, ఎఫ్బివోలు మల్లిఖార్జున్, అరవింద్, హబీబా, రవీనా, సంతోష్, అరుణ్ మరియు వాచర్లు తదితరులు పాల్గొన్నారు.



## 95 కిలోల గుండు ఎత్తి చరిత్ర సృష్టించిన యువకుడు

**ముథోల్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలో హోలీ ఉత్సవాన్ని పురస్కరించుకొని, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో 50 కిలోలు, 95 కిలోల గుండును లేపే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా, గ్రామానికి చెందిన మేకల భూపతి అనే యువకుడు 95 కిలోల గుండును ఎత్తి చరిత్ర సృష్టించాడు. ఆయనను గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జయలలిత, వీడిసి అధ్యక్షులు తోట గంగాధర్, కోశాధికారి సాయిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



## దుబాయ్ ఎయిర్‌పోర్టులో చిక్కుకున్న చెన్నూరు వాసి



**చెన్నూర్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని కోటబొగుడ కాలనీకి చెందిన కొత్తపల్లి నాగరాజు దుబాయ్ ఎయిర్‌పోర్టులో చిక్కుకోవడంతో అతడి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం చెన్నూర్ పట్టణానికి చెందిన నాగరాజు పట్టణంలోని ఐఐఎఫ్ఎల్ అనే ప్రైవేటు బ్యాంకులో బ్రాంచ్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం బ్యాంకు సిబ్బందిని హై ట్రిప్‌లో భాగంగా సంస్థ దుబాయ్‌కు పంపించింది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా యుద్ధ వాతావరణంతో దుబాయ్ ఎయిర్‌పోర్టుపై దాడులు జరిగి అన్ని విమానాలు రద్దయ్యాయి. దీంతో నాగరాజుతో పాటు మరో ముగ్గురు

ఆందోళన చెందుతున్న కుటుంబ సభ్యులు

ఐఐఎఫ్ఎల్ సిబ్బంది దుబాయ్‌లో చిక్కుకున్నారు. అక్కడి ఎయిర్‌పోర్టు క్లియరెన్స్ ఇచ్చేంత వరకు కూడా వారు ఇండియాకు తిరిగిరాలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు నాగరాజు కుటుంబ సభ్యులు ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కుటుంబీకులతో వీడియోకాల్‌లో మాట్లాడిన నాగరాజు తాను క్షేమంగా ఉన్నానని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపాడు. తన భర్తను సురక్షితంగా ఇండియాకు తీసుకురావాలని మంత్రి వివేక్ వెంకటస్వామిని నాగరాజు భార్య కోరింది.



## మున్సిపల్‌లో ఏకపక్ష నిర్ణయాలు మానుకోవాలి



**నిర్మల్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ మున్సిపాలిటీలో ఒకవర్గానికి ప్రాధాన్యత ఇచ్చేలా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రామనాథ్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రానున్న రంజాన్ వేడుకలకు వాటి బిల్లుల చెల్లింపు కోసమే ఈ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు కనిపిస్తుందన్నారు. గతంలో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ముఖ్యమంత్రితో నిర్మల్ మున్సిపల్ అభివృద్ధికి రూ.50 కోట్లు నిధులు కేటాయించాలని కోరగా 15 కోట్లు మంజూరైన సంగతి తెలిసిందే. ఈ పనులను అధికారులతో సమీక్షించి 42 వార్డులలో అక్కడి అవసరాలను బట్టి నిధులు కేటాయిస్తే, టెండర్లు సైతం పూర్తయితే మొన్నటి అత్యవసర సమావేశంలో ఈ టెండర్లు రద్దు చేయడాన్ని బీజేపీ పార్టీ వ్యతిరేకిస్తుందన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు స్థానిక మున్సిపల్ చైర్మన్‌పై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నిర్మల్ పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే తాగునీటి కోసం కేంద్ర ప్రభుత్వం నుండి 62.50 కోట్లు, మురికి నీటి శుద్ధి కోసం రూ.42 కోట్లతో ప్లాంట్ల మంజూరుకు కృషి చేశారని అన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధికి తోడ్పాటు అందిస్తారన్నారు. కార్యక్రమం లో కౌన్సిలర్లు గంజి రాజు, కమ్మం సురేందర్, సాదాం అరవింద్, వొడిసెల అర్జున్, నరేష్, సాత్విక్, సూరజ్, విఠల్, శశాంక్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.




కోసినిలో నిరుపేదలకు

## ఇళ్ల పట్టాల కోసం వినతి

**కాగజ్‌నగర్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**
కాగజ్‌నగర్ మండలంలోని కోసిని గ్రామ పంచాయతీ పరిధిలో 15 నుండి 40 ఏళ్లుగా నివసిస్తున్న నిరుపేద కుటుంబాలు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని అధికారులను కోరారు. పట్టాలు లేకపోవడంతో ప్రభుత్వ గృహ పథకాల లబ్ధి పొందలేకపోతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన వారు, ఇళ్ల చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి కూడా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. అలాగే సమస్య పరిష్కారానికి కాగజ్‌నగర్ ఎమ్మార్వో మరియు ఎంపీడీవోలకు కూడా వినతిపత్రాలు అందజేశారు.

కొడుకు మందలించాడని

## తండ్రి బలవన్మరణం

**నార్నూర్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**



ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం గుండాలలో విషాద ఘటన చోటుచేసుకుంది. మద్యం సేవించవద్దని కుమారుడు మందలించినందుకు మనస్థాపానికి గురైన జంగు(41) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యం విషయం పై కుమారుడు మందలించడంతో జంగు పురుగుల మందుతాగినట్లు ఎస్సై తెలిపారు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో

## వృద్ధుడికి తీవ్ర గాయాలు

**లక్ష్మణచాంద, మార్చి 3 (ప్రభాత సమాచారం)**
లక్ష్మణచాంద మండలం బోరిగాం గ్రామం వద్ద మంగళవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో దిలావర్పూర్ మండలం సాంగ్వి గ్రామానికి చెందిన గంగారం అనే వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డారు. బంధువుల ఇంటికి వెళ్తున్న వృద్ధుడిని ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. సంఘటనా స్థలానికి చేరుకున్న ఈఎంటి శేఖర్, పైలెట్ విజయ్ కుమార్ క్షతగాత్రుడిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు.



# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక'కు శ్రీకారం

## అధికారులకు దిశానిర్దేశం చేసిన సీఎం రేవంత్ రెడ్డి

**నిర్మల్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**

ఈ నెల (మార్చి) 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికను అమలు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో జిల్లా కలెక్టర్ల సదస్సు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రణాళిక శాఖ నోడల్ విభాగంగా వ్యవహరించే ఈ బృహత్తర కార్యక్రమాన్ని ఐదు దశల్లో నిర్వహించనున్నాట్లు తెలిపారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2న గ్రామ సభలు, ఏప్రిల్ 16న మండల స్థాయి కార్యక్రమాలు, మే 2న నియోజకవర్గ స్థాయి, మే 22న జిల్లా స్థాయి సమావేశాలను నిర్వహించాలని, జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలతో ఈ కార్యక్రమం ముగియనున్నట్లు వివరించారు. మార్చి 6న అన్ని ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు నిర్వహించి, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వం ఈ కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రత, పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్, ఆరోగ్యం, రోడ్డు భద్రత (అరైవ్-అలైవ్), సంక్షేమం, పిల్లల భద్రత, డ్రగ్స్ నిర్మూలన, రైతు సంక్షేమం, విద్య, క్రీడలు, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి 10 ప్రత్యేక అంశాలపై శాఖల వారీగా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమ పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌ను ప్రభుత్వం వినియోగించనుందనీ, క్షేత్రస్థాయిలో పనులు పారదర్శకంగా, వేగంగా జరిగేలా చూడటమే ఈ ప్రణాళిక ముఖ్య ఉద్దేశమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.





### నిర్మల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో

# హోలీ సంబరాలు

**నిర్మల్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం హోలీ సంబరాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి హాజరయ్యారు. ఒకరిపై ఒకరు రంగులు పూసుకుని హోలీ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో కలిసి నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నరేందర్, గోపీనాథ్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఉన్నారు.

# వదంతులను నమ్మవద్దు

**జైనథ్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**

భీంపూర్ మండలం పిప్పలకోటిలోని పెద్దమ్మ దేవాలయంలో విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఎస్సై విక్రం దర్యాప్తు చేపట్టగా, స్థానికుల వాంగ్మూలాల ఆధారంగా చిరంజీవి అనే వ్యక్తిని గుర్తించారు. విచారణలో నిందితుడు మతిస్థిమితం లేక చికిత్స పొందుతున్నట్లు వెల్లడైంది. ప్రజలు పుకార్లను నమ్మవద్దని, సమన్వయం పాటించాలని సీఐ శ్రవణ్ సూచించారు.

# మట్టిలో మాణిక్యాల పోరు.. గెలుపు కోసం కుస్తీ హోరు



**బజార్‌హత్నూర్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలో సాంప్రదాయంగా వస్తున్న కుస్తీ పోటీలు మంగళవారం హోరాహోరిన సాగాయి. మొదట పిల్లలతో కొబ్బరికాయతో ప్రారంభమైన కుస్తీ పోటీలు స్థాయిని బట్టి రూ.10 నుంచి రూ.5000 వరకు పోటీలు నిర్వహించారు. రాష్ట్ర, అంతరాష్ట్ర మల్లయోధులతో హోరాహోరి నా ముగిసింది. ఈ కుస్తీ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా పక్క రాష్ట్రాలైనటువంటి నాందేడ్, యవత్మల్, అవురంగబాద్, అమరావతి, కిన్వాట్, మహూర్ తదితర జిల్లాల నుండి మల్లయోధులు పాల్గొన్నారు. ప్రస్తుతం పరిస్థితుల్లో యువత, క్రికెట్, తదితర క్రీడల పట్ల మోజు చూపుతున్నప్పటికీ గ్రామీణ ప్రజలు మాత్రం ఈ కుస్తీ పోటీల పట్ల మోజును వీడడం లేదు. ఈ పోటీలను వీక్షించడానికి చిన్న, పెద్ద మహిళలు అనే తారతమ్యం లేకుండా భారీ ఎత్తున తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు సైతం ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పరచ సాయన్న, గ్రామస్తులు దుబ్బుల చంద్రశేఖర్, చట్ల వినీల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఆధ్వర్యంలో రూ.6400కే పూరి జగన్నాథ యాత్ర

**నిర్మల్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**



ఆర్టీసీ నిర్మల్ డిపో ఆధ్వర్యంలో మార్చి 8 వ పూరి జగన్నాథ యాత్ర టీజీ ఆర్టీసీ సర్వీసు ఏర్పాటు చేసినట్టు నిర్మల్ డిఎం పండరీ తెలిపారు. అన్నవరం, సింహచలం, అర్సవెల్లి, కోణార్క్, పూరి జగన్నథ్, విశాఖపట్నం, ద్వారాకా తిరుమల పుణ్యక్షేత్రాలకు వెళ్లేవారికి ఇది మంచి అవకాశం అన్నారు. సూపర్ లగ్జరి బస్సుకు పోను రాను (అప్ అండ్ డౌన్)కు కేవలం రూ.6400/-లకే 6 రోజుల యాత్ర ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలవారు నిర్మల్ బస్టాండ్‌లో కాని మీ ఫోన్ ద్వారా కాని ముందుగా టికెట్ బుక్ చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 7382842582లో సంప్రదించాలని తెలిపారు.



### నిర్మల్ ఎంఐఎం పట్టణ

# అధ్యక్షుడిగా ముజాహిద్ అలీ

**నిర్మల్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ పట్టణ ఎంఐఎం పార్టీ అధ్యక్షునిగా పట్టణంలోని కోరుకొండ చెందిన మాజీ కౌన్సిలర్ ముజాహిద్ హలీ ఎన్నికయ్యారు. ఎంఐఎం పార్టీలో సుదీర్ఘ కాలంగా పని చేస్తున్న ఆయనను పార్టీ అధ్యక్షుడిగా నియమిస్తూ ఎంఐఎం అధ్యక్షులు అసవుద్దీన్ ఓవైసీ నాంపల్లి ఎమ్మెల్యే ముజీద్ హుస్సేన్ ఖాన్ ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు. ఇప్పటివరకు పార్టీ అధ్యక్షులుగా అజీమ్ బిన్ అయ్యా అధ్యక్షుడిగా కొనసాగారు. మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్గా ఓడిపోవడంతో సీనియర్ నాయకుడైన ముజాహిద్ అలీకి పట్టణ అధ్యక్షుడిగా అవకాశం కల్పించారు. పట్టణంలో ఎంఐఎం పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పట్టణ నూతన అధ్యక్షులు ముజాహిద్ అలీ అన్నారు. పట్టణ అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా పార్టీ అధిష్టానం నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎంఐఎం పార్టీలో సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న ఆయనను పార్టీ అధ్యక్షుడిగా నియమిస్తూ ఎంఐఎం అధ్యక్షులు అసదుద్దీన్ ఓవైసీ, నాంపల్లి ఎమ్మెల్యే ముజీద్ హుస్సేన్ ఖాన్ ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు. ఇప్పటివరకు పార్టీ అధ్యక్షులుగా అజీమ్ బిన్ అయ్యా అధ్యక్షుడిగా కొనసాగారు. మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్గా ఓడిపోవడంతో సీనియర్ నాయకుడైన ముజాహిద్ అలీకి పట్టణ అధ్యక్షుడిగా అవకాశం కల్పించారు.

# చోరీ కేసులో నిందితులకు జైలు

**నిర్మల్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా కేంద్రంలో 2024లో శ్రీనివాస్, సుజాత కలిసి బస్టాండ్ సమీపంలో ఒక వ్యక్తి మెడలో నుంచి ఆరు గ్రాముల బంగారు గొలుసు, మొబైల్ ఫోన్ దొంగిలించారు. బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. విచారణలో నేరం రుజువు కావడంతో, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి నిందితులకు ఏడు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 2500 జరిమానా విధించారు. ఈ వివరాలను ఎస్పీ జానకి షర్మిల మంగళవారం తెలిపారు.

# వన్య ప్రాణులకు హాని కలిగించవద్దు

**వేమనపల్లి, మార్చి 3 (ప్రభాత సమాచారం)**

వన్య ప్రాణులకు హానీ కలిగించవద్దని నీల్వాయి ఎఫ్ఆర్‌వో హఫీజుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచవన్యప్రాణి దినోత్సవం సందర్భంగా కల్మలపేట, నీల్వా యి, కేతనపల్లి గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి వన్య ప్రాణులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వన్య ప్రాణుల సంరక్షణలో అందరు భాగస్వాములు కావాలన్నారు. ప్రజలు అడవుల్లోకి వె ళ్లవద్దని, కాల్చిన బీడీలు, సిగరెట్లు అడవిలో పారవస్తే ఎండిన ఆకులకు అంటుకుని మంటలు చెలరేగి వన్యప్రాణులకు హానీ జరిగే అవకాశం ఉందన్నారు. అలాగే వన్యప్రాణులను హతమార్చడం కోసం ఉచ్చు లు, కరెంటు తీగలు అమర్చేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. వన్య ప్రాణులకు హానీ తలపెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో ప్రమోద్‌కుమార్, సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్ మహిపాల్, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.



# గ్రహణాల పట్ల మూఢనమ్మకాలు తొలగాలి

**ఆదిలాబాద్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**
చంద్ర గ్రహణం సందర్భంగా ప్రజలు మూఢ నమ్మకాలు నమ్మవద్దంటూ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మంగళవారం స్థానిక తెలంగాణతల్లి చౌక్‌లో గ్రహణ సమయంలో ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకోవద్దని ప్రజల్లో ఉన్న మూఢనమ్మకాన్ని పారద్రోలేలా వేదిక సభ్యులు చంద్ర గ్రహణా న్ని వీక్షిస్తూ, అల్పాహారం తినడం, నీటిని తాగు తూ ప్రజల్లో ఉన్న మూఢనమ్మకాన్ని పారదోలెందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా వేదిక రాష్ట్ర కార్యదర్శి నూతల రవీందర్ మాట్లాడుతూ... గ్రహణాల పట్ల ప్రజలలో ఉన్న అపోహలు, మూఢ విశ్వాసాలు తొలిగిం చే ప్రయత్నంగా తమ వంతుగా చేయడమేనని అన్నారు. మనిషి రాకెట్‌లలో దూసుక పోయి అంతరిక్షం, గ్రహాంతర ప్రయాణం చేస్తూ, పరిశోధనలు చేయుచున్న ఈ ఆధునిక కాలంలో కూడా ఒక వైపు సైన్స్ చదువుతూ నిత్యజీవి తంలో మాత్రం అశాస్త్రీయంగా వ్యవహరిస్తున్నాతన్నారు. గ్రహణాలకు కారణాలు స్పష్టంగా



తెలిసి కూడా సంకుచితంగా ఆలోచించటం జరుగుతున్నదనీ పేర్కొన్నారు. చంద్ర గ్రహణాన్ని మామూలు కళ్ళతో కూడా వీక్షించవచ్చు న్నారు. కార్యక్రమంలో వేదిక జిల్లా అధ్యక్షులు దండ నాయక ఉమాకాంత్, జిల్లా గౌరవ అధ్యక్షులు వీరన్న, ఉదారి నారాయణ, జిల్లా నాయ కులు శ్రీధర్ బాబు, బేదోడ్కర్ సంతోష్ కుమా ర్, గంగన్న, మెస్రం రాజు, లింగారెడ్డి, కంటే నర్సయ్య, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.







## అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

**నిర్మల్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**
నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్ కాయిల్స్‌ను దొంగిలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను నిజామాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ముఠాలో పాత నేరస్తులు కూడా ఉన్నారని, వీరి వద్ద నుండి 1.20 క్వింటాళ్ల కాపర్ కాయిల్స్, రూ.2.75 లక్షల నగదు, దొంగిలించిన వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. ఏడుగురు నిందితులను అరెస్ట్ చేయగా, ముగ్గురు పరారీలో ఉన్నారు.

### కారు ఢీకొని వాణిజ్య
## పన్నుల శాఖ ఇన్స్పెక్టర్ మృతి

**జైపూర్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**



మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని ఇందారం క్రాస్రోడ్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సోమవారం రాత్రి వాణిజ్య పన్నుల శాఖ సీనియర్ ఇన్స్పెక్టర్ అనురాగ్ (35) ఇందారం క్రాస్ వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో ఇందారం వైపు ఓ కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### కుమురం భీమ్ జిల్లా ఎస్పీ క్యాంపులో
## ఘనంగా హోలీ వేడుకలు

**ఆసిఫాబాద్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**
కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా ఎస్పీ నితికా పంత్ పాల్గొని పోలీస్ అధికారు లు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. హోలీ ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, కొత్త వెలుగును నింపాలని ఆమె ఆకాంక్షించారు. విధుల్లో నిమగ్నమై ఉండే సిబ్బందికి ఇటువం టి వేడుకలు మానసిక ఉల్లాసాన్ని, పరస్పర ఐక్యతను పెంపొందిస్తాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.





### అటవీ సంరక్షణ
## అందరి బాధ్యత

**పెంచికల్‌పేట, మార్చి 3 (ప్రభాత సమాచారం)**
అటవీ సంరక్షణ అందరి బాధ్యత అని డిప్యూటీ రేంజ్ అధికారి అస్మా అన్నారు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా మండలంలోని ఎల్లూరు, ఆగర్‌గూడ, లోడ్పల్లి గ్రామాల్లో కళాజాతా బృందం ఆధ్వర్యంలో మంగళవారం అటవీ సంరక్షణ, అటవీ జంతువులవేట, అడవిలో సంభవించే నిప్పు నివారణ చర్యలు వంటి పలు అంశాల మీద అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోయచిచ్చాల నుంచి ఆగర్‌గూడ వెళ్లే కరెంటు తీగల వద్ద వేటగాళ్ల ఉచ్చులో అనేక జంతువులు మరణిస్తున్నాయని అన్నారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం గ్రామ సభ నిర్వహించి విద్యుత్ తీగలను రోడ్డు పక్క నుంచి మార్చడం కోసం గ్రామ సభ నిర్వహించి ఆమోదం పొందే విధంగా కృషి చేస్తామని సర్పంచ్ రవీందర్ హామ్నీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేశ్వరి, ప్రజలు పాల్గొన్నారు.

**విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు...**
చింతలమానేపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో మంగళవారం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని పురస్కరించు కుని విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే కర్జెల్లి రేంజ్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో ముసలమ్మ గుట్ట, భీమన్నదేవాలయం, శివపల్లి శివాలయం పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ కవర్లను ఏరివేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్వో సుభాష్, ఎఫ్ఎస్ఓ శ్రీనివాస్, ఎఫ్‌బీఓలు ప్రభాకర్, దినేష్, మురళీ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



### నిర్మల్ జిల్లా ప్రధాన
## న్యాయస్థానంలో హోలీ వేడుకలు

**నిర్మల్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రధాన న్యాయస్థానంలో మంగళవారం హోలీ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి, సీనియర్ సివిల్ జడ్జి రాధిక, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి రవీందర్, జూనియర్ సివిల్ జడ్జిలు భవిష్య, నిఖితతో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు. అందరూ ఒకరికొకరు రంగులు చల్లుకొని హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ రంగుల పండుగ ప్రజల జీవితాల్లో ఆనందాన్ని, వెలుగును నింపాలని ఆకాంక్షించారు.

## నిల్వ ఉంచిన కలప పట్టివేత

**ఇచ్చోడ, మార్చి 3 (ప్రభాత సమాచారం)**
ఇచ్చోడ మండలం గుండాల గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన టేకు దుంగలను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం ఆధారంగా అధికారులు తనిఖీలు నిర్వహించగా ఈ అక్రమ నిల్వలు బయటపడ్డాయి. ఇచ్చోడ ఎఫ్ఆర్ఓ నాగవత్ స్వామి, సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్ ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. స్వాధీనం చేసుకున్న టేకు దుంగలను అటవీశాఖ కార్యాలయానికి తరలించారు.



# నిందితులను కఠినంగా శిక్షించాలి

### పెద్దమ్మ తల్లి విగ్రహాల ధ్వంసంపై ముదిరాజ్ నేతల నిరసన

**ఆదిలాబాద్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**
భీంపూర్ మండలం పిప్పల్ కోటి గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహాలను ధ్వంసం చేసిన ఘటన ఆందోళనకు దారి తీసింది. పోచమ్మ తల్లి విగ్రహం ధ్వంసం పట్ల ముదిరాజ్ సంఘం నేతలు ఆందోళనకు దిగారు. అఖిల భార త కోలీ సమాజ్ జాతీయ కార్యవర్గ సభ్యులు డాక్టర్ బొజ్జ నారాయణ ముదిరాజ్, మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కొలిపూర్‌లో జరిగిన ముదిరాజ్ సంఘ సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. హోలీ వేడుకల్లో భాగంగా నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ముదిరాజ్ మహాసభ నేతలు పిప్పల్ కోటి గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహాల ధ్వంసం ఘటనను తీవ్రంగా ఖండించారు. దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సమాజ్ జిల్లా ఉపాధ్యక్షులు బోయులు బొమ్మన లస్మన్న ముదిరా జ్, ఈగల పోచన్న, ఆదినారాయణ, ధార వేణి గంగారెడ్డి ముదిరాజ్ , మామిళ్ళ రాములు, శ్రీపతి దత్తు దయ్యాల సంతోష్, దార్ష పెంటన్న, కొండవేణి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కాగా భీంపూర్ మండలం పిప్పల్ కోటి గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయ విగ్రహం ధ్వంసం చేసిన మతిస్థిమితం లేని వ్యక్తి అని జైనథ్ సిఐ శ్రావణ్ తెలిపారు. గ్రామస్తులు ఫిర్యాదు చేయగా, భీంపూర్ పోలీసులు ఎస్సై విక్రం వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. స్థానికుల వాంగ్మూలాల ఆధారంగా పిట్ల చిరంజీవి అనే వ్యక్తి విగ్రహాన్ని ధ్వంసం చేసినట్లు గుర్తించామని సీఐ తెలిపారు. ప్రజలు ఎలాంటి పుకార్లను నమ్మవద్దన్నారు.

### చాకెపల్లి జిల్లా పరిషత్
## ఉన్నత పాఠశాలలో బోర్వెల్

**బెల్లంపల్లి, మార్చి 3 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి మండలంలోని చాకెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన వాటర్ బోర్డు ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీటీసీ, స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రాబోయే ఎండాకాలంలో నీటి కొరత ఉండదని పేర్కొన్నారు. విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# వసంత వేళ.. రంగుల హేల

**వైభవంగా హోలీ వేడుకలు**
**హోలీ హంగామా**
**రంగుల జాతరలో తడిసిముద్దైన జనం!**
**పల్లెల్లో పండుగ జోరు**



**ఆసిఫాబాద్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో కేంద్రంలోని పలు కాలనీల్లో చిన్న పెద్ద తేడా లేకుండా ఉత్సావాల్లో పాల్గొన్నారు. సంప్రదాయం ప్రకారం కామ దహనం నిర్వహించి మరుసటి రోజు హోలీ వేడుకలు చేయడం పరిపాటి. పట్టణంలోని రావులవాడ, టీఆర్‌నగర్, సందీప్‌నగర్, పైకాజీనగర్, జన్కాపూర్, దస్నాపూర్ ప్రాంతాల్లో చిన్న పిల్లలు, మహిళలు, యువకులు రంగులు చల్లుకున్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన హోలీ వేడుకల్లో జల్లా ఎస్పీ నితికా పంత్, డీఎఫ్‌వోనీరజ్‌కుమార్, ఎమ్మెల్యే కోవలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, సీఐ బాలాజీ వరప్రసాద్‌లు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ పోలీసు సిబ్బందితో కలిసి ఆనందోత్సవాల మధ్య నృత్యాలు చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. పెంచికలపేట మండల వ్యాప్తంగా హోలీ సంబరాలను చిన్న పెద్ద తేడా లేకుండా ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. రెబ్బెన మండల కేంద్రంలో మంగళవారం హోలీ సంబరాలను ఈ సందర్భంగా పిల్లలు, పెద్దలు రోడ్డుపైకి వచ్చి ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రధాన రహదారిపై డప్పు చప్పులతో డ్యాన్సులు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. జైనూర్ మండల కేంద్రంతో పాటు మారుమూల గ్రామాల్లో ప్రజలు హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం ఈ పండుగను పిల్లలు, పెద్దలు, మహిళలు ఉత్సాహ భరిత వాతావరణంలో ఆనందోత్సావాలతో జరుపుకున్నారు. ఆదివాసీల జాజిరీ కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొడప ప్రకాష్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావ్, మాజీ సహకార చైర్మన్ కొడప హన్ను పటేల్ , మాజీ సర్పంచ్ మడావి భీంరావ్, సీనియర్ నాయకులు మేస్రాం అంబాజీ పాల్గొన్నారు. సిర్పూర్(యు) మండలంలో రంగుల పండుగ హోలీని ఆదివాసీలు తమ సంప్రదాయ పద్ధతుల్లో జరుపుకున్నారు. ఉదయం నుంచే డోలు, సన్నాయి నాదాలు మార్మోగి పండుగ వాతావరణాన్ని సృష్టించాయి. యువకులు సంప్రదాయం ప్రకారం గుంపులుగా చేరి నృత్యాలు చేస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. సోమవారం రాత్రి నిర్వహించిన కామ దహనం కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు. వాంకిడి మండలంలో హోలీ పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. యువత, పిల్లలు, ప్రత్యేకంగా ఉత్సాహం చూపుతూ ఒకరిపై ఒకరు రంగులు చల్లి సంతోషాన్ని పంచు న్నారు. మహిళలు సంప్రదాయ వంటకాలు తయారు చేసి పండగను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకున్నారు. దహెగాం మండలంలోని పార్వతిపేట, కుంచెవెల్లి, దహెగాం, ఇట్యాల, హత్తి ని, మాడవెల్లి, కల్వాడ, కమ్మర్‌పల్లి తదితర గ్రామా ల్లో హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. యువతీ యువకులు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. ఆటపాట లతో కామదహనం నిర్వహించారు. బెజ్జూరు మండల వ్యాప్తంగా హోలీ సంబరాలు చిన్న పెద్ద తేడా లేకుండా ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. పలు గ్రామాల్లో కామదాహనం నిర్వహించారు. చింతలమానేపల్లి మండలంలో ఉదయం నుంచే గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో హోలీ సంబరాలు ప్రారంభమయ్యాయి. యువత, పిల్లలు, ప్రత్యేకంగా ఉత్సాహం చూపుతూ ఒకరిపై ఒకరు రంగులు చల్లి సంతోషాన్ని పంచుకున్నారు. కెరమెరి మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి కామ దహనం కార్యక్రమం జరుపుకున్నారు. మంగళవారం ఉదయం నుంచే హోలీ వేడుకలు ఉత్సాహంగా జరుపుకున్నారు. మహిళలు సైతం ఉత్సాహంగా పాల్గొని తమ స్నేహితురాళ్లకు, బంధువులకు రంగులు చల్లి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం సమీప వాగులు, కుమరం భీం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లలో స్నానాలు చేసి విందు భోజనాలు చేశారు. సిర్పూర్(టి)లో హోలీ సందర్భంగా పలు గ్రామాల్లో కామదాహనం నిర్వహించారు మండల వ్యాప్తంగా హోలీ సంబరాలు చిన్న పెద్ద తేడా లేకుండా ఆనందోత్సవాల మధ్య జరుపు కున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. కౌటాల మండలంలో యువత, పిల్లలు, ప్రత్యేకంగా ఉత్సాహం చూపుతూ ఒకరిపై ఒకరు రంగులు చల్లి సంతోషాన్ని పంచుకున్నారు. ఉదయం నుంచే గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో హోలీ సంబరాలు ప్రారంభమయ్యాయి. పలు చోట్ల డీజే పాటలతో యువకులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. మహిళలు సంప్రదాయ వంటకాలు తయారు చేసి పండగను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకున్నారు.



## పండగపూట విషాదం
## అదుపుతప్పి బావిలో పడ్డ కారు

**ఖానాపూర్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని బీర్నంది గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కారు అదుపుతప్పి బావిలో పడటంతో ఒక యువకుడు ప్రాణాలు కోల్పోయిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నిర్మల్ జిల్లా కడం మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ (38) అత్యవసర పనిమీద ఖానాపూర్ మండలం రంగపేట్ గ్రామానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. బీర్నంది గ్రామ పంచాయతీ పరిధిలోని కొమ్ముతండా సమీపంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న బావిలో కారు అదుపుతప్పి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కడం మండల కేంద్రంలోని 'మన్ గ్రోమోర్' సంస్థలో మేనేజర్‌గా పని చేస్తున్నట్లు ప్రాథమిక సమాచారం. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## 13వ వార్డులో పారిశుద్ధ్య కార్యక్రమాలు

**బెల్లంపల్లి, మార్చి 3 (ప్రభాత సమాచారం)**

మంగళవారం బెల్లంపల్లి మున్సిపాలిటీ 13వ వార్డులో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ కార్మికులు మురుగు కాలువల్లోని చెత్తాచెదారాన్ని, మురుగునీటిని తొలగించారు. అంతర్గత రహదారుల వెంబడి పిచ్చి మొక్కలను కూడా తొలగించారు. వార్డును పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజల సహకారం అవసరమని స్థానిక కౌన్సిలర్ కోరారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**రెబ్బెనలో కారు బైక్ ఢీకొని యువకుడి దుర్మరణం**
**స్నేహితులతో కలిసి వాగుకు వెళుతుండగాత ప్రమాదం**
**మరో ఇద్దరికి తీవ్ర గాయాలు.. విషమంగా పరిస్థితి**



**రెబ్బెన, మార్చి 3 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని రెబ్బెన మండలం నారాయణపూర్ గ్రామ శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై వెంకటకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం, కిష్టాపూర్ గ్రామంలో పత్తి చేను పనుల కోసం ఇటీవల మహారాష్ట్రకు చెందిన కొంతమంది కూలీలు వలసగా వచ్చారు. ఆ కూలీలలో లక్ష్మి అనే యువతితో రాందాస్ విఠల్ పవర్ (22)కు ఇటీవల వివాహం నిశ్చయమైంది. హోలీ పండుగ సందర్భంగా రాందాస్ తన స్నేహితులు తుకారం, సూరజ్ విఠల్ జాదవ్తో కలిసి కిష్టాపూర్కు వచ్చాడు. లక్ష్మిని కలిసి పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై నారాయణపూర్ వైపు వెళుతుండగా, అతివేగంగా వస్తున్న ఇన్నోవా కారు బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాందాస్ అక్కడికక్కడే మృతి చెందాగా, తుకారం, సూరజ్ లు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి అన్న సిరజ్ విఠల్ పవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వాతావరణ సమతుల్యతకు వన్యప్రాణులు అవసరం

**జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్**

**ఆసిఫాబాద్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**

వాతావరణ సమతుల్యతకు వన్య ప్రాణులు ఎంతో అవసరమని జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయ ఆవరణలో ఆసిఫాబాద్ రేంజ్ అధికారి గోవింద్ చంద్ సర్దార్ అధ్యక్షతన నిర్వహించిన ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణతో వాతావరణ సమతుల్యత సాధ్యమవుతుందని అన్నారు. అడవులు వన్యప్రాణుల రక్షణకు ప్రజలు తమతో కలిసి రావాలని కోరారు. అటవీశాఖ తరఫున వన్యప్రాణుల సంరక్షణ కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అనంతరం మాణిక్ గూడా అర్బన్ పార్క్ లో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారులు యోగేష్ కులకర్ణి, ఝాన్సీ రాణి, సెక్షన్ అధికారులు మహేందర్, సాయిచరణ్, సతీష్, బీట్ అధికారులు పాల్గొన్నారు.



## హత్యయత్నం.. తండ్రి కొడుకు అరెస్ట్

**ఆదిలాబద్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్‌లోని విద్యానగర్‌లో ఆర్థిక లావాదేవీల మనస్పర్థల కారణంగా ప్రకాష్ జైస్వాల్ పై కత్తితో దాడి చేసిన తండ్రీకొడుకులు ఉమర్ ఖలీల్, వసీం కోకర్‌లను టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి కత్తి, రెండు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. ప్రజలు ఎలాంటి సమస్యలకైనా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించవచ్చని పోలీసులు సూచించారు.



# 'మనం' రిపీట్?



టాలీవుడ్ సీనియర్ స్టార్స్‌లో రేసులో ముందు వరుసలో నిలుస్తున్నారు మెగాస్టార్ చిరంజీవి, నందమూరి బాలకృష్ణ, విక్టరీ వెంకటేష్. చిరంజీవి `మన శంకర వరప్రసాద్` మూవీతో ఈ సంక్రాంతికి బ్లాక్ బస్టర్ హిట్‌ని సొంతం చేసుకోవడమే కాకుండా రూ.300 కోట్లు రాబట్టి తన సత్తా చాటుకున్నారు. ఇక నందమూరి బాలకృష్ణ `భగవంత్ కేసరి, `డాకు మహారాజ్ వంటి సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ సూపర్ హిట్‌లని తన ఖాతాలో వేసుకున్నారు. గత ఏడాది డిసెంబర్‌లో విడుదలై `అఖండ 2` కూడా మంచి వసూళ్లనే రాబట్టింది.ఇక వెంకీ మామ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. గత ఏడాది సంక్రాంతి బరిలో `సంక్రాంతికి వస్తున్నాం` అంటూ భారీ బ్లాక్ బస్టర్ హిట్‌ని సొంతం చేసుకున్నారు. అయితే వీరి తరహాలో కింగ్ నాగార్జున మాత్రం సక్సెస్‌లని సొంతం చేసుకోలేక `కుబేర`, కూలీ` లాంటి సినిమాల్లో కీలక పాత్రల్లో నటిస్తూ వస్తున్నారు. దీంతో ఆయన అభిమానులు కొంత నిరాశకు లోనవుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కింగ్ నాగార్జున మళ్లీ తనదైన మార్కు సూపర్ బ్లాక్ బస్టర్‌తో ట్రాక్‌లోకి రావాలనే ప్రయత్నాలు మొదలు పెట్టారు.ఇందులో భాగంగానే తన వందవ ప్రాజెక్ట్‌కు సైలెంట్‌గా శ్రీకారం చుట్టారు. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై నాగార్జున నటిస్తూ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాజెక్ట్‌ని నిర్మిస్తున్నాడు. ఈ మూవీకి తమిళ దర్శకుడు నవీన్ (ఆర్. కార్తీక్) దర్శకత్వం వహిస్తున్నాడు. #king100 అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ మూవీకి `లాటరీ కింగ్` అనే టైటిల్‌ని ఫైనల్ చేసినట్టుగా తెలిసింది. అంతే కాకుండా ఇందులోని కీలక పాత్రలో టబు నటిస్తుండగా కింగ్‌కు జోడీగా స్టార్ హీరోయిన్ శ్రీలీల నటించే అవకాశం ఉందని ఇన్ సైడ్ టాక్.పీరియాడిక్ డ్రామాగా, ఎమోషనల్ ఫ్యామిలీ యాక్షన్ థ్రిల్లర్‌గా దీన్ని అత్యంత భారీ స్థాయిలో రూపొందిస్తున్నారు. ఇందులో నాగార్జున పవర్‌ఫుల్ కింగ్‌గా కనిపించనున్నారట. గత కొంత కాలంగా తనదైన మార్కు సినిమాని అందించాలని ఆసక్తిగా ఎదురుచూస్తూ వచ్చిన నాగార్జున ఈ మూవీని చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏ విషయంలోనూ రాజీపడకుండా నిర్మిస్తున్నారు. ఈ మూవీ కోసం సరికొత్త నేపథ్యాన్ని ఎంచుకుని పీరియాడిక్ ఫిక్షనల్ స్టోరీతో దీన్ని తెరపైకి తీసుకొస్తున్నారట.భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ మూవీలోని కీలక అతిథి పాత్రల్లో నాగచైతన్య, అఖిల్ కనిపించి అక్కినేని అభిమానుల్ని సర్‌ప్రైజ్ చేయనున్నారని, మరోసారి అక్కినేని ఫ్యామిలీ బ్లాక్ బస్టర్ మూవీ `మనం`ని గుర్తు చేయబోతున్నారని ఇండస్ట్రీ వర్గాల సమాచారం. ప్రస్తుతం టీమ్ కర్ణాటకలోని మైసూర్‌కు వెళుతోంది. అక్కడే చారిత్రక కట్టడాల నేపథ్యంలో పలు కీలక సన్నివేశాలని చిత్రీకరించబోతున్నారు. ఈ షెడ్యూల్ సినిమాకు అత్యంత కీలకం అని, సినిమాలో ఈ సన్నివేశాలు హైలైట్‌గా నిలుస్తాయని ఇన్ సైడ్ టాక్.





# చరణ్ డెడికేషన్‌కు ఫిదా!

పెద్ది' సినిమాలోని తొలి పాట 'చికిరి చికిరి'కి రికార్డు స్థాయిలో వ్యూస్ దక్కాయి. అందులోని హుక్‌స్టెప్ సోషల్ మీడియాలో ట్రెండ్ అయింది. సోమవారం రాత్రి విడుదలైన రెండో పాట 'రై రై రారా' కూడా అదే జోరు కొనసాగిస్తోంది. ఇప్పటికే నెటిజన్లు ఈ సాంగ్‌కు సంబంధించిన రీల్స్‌తో సందడి చేస్తున్నారు. కేవలం తెలుగు లిరికల్ వీడియోకే యూట్యూబ్‌లో ఇప్పటి వరకూ 17+ మిలియన్ వ్యూస్ రావడం విశేషం. ఈ విజయం వెనుక దాగిన కష్టాన్ని చిత్ర దర్శకుడు బుచ్చిబాబు పంచుకున్నారు. ఈ పాట షూటింగ్ సమయానికి రామ్‌చరణ్ కు తీవ్ర జ్వరం ఉందని, దీంతో షూటింగ్ ఆపేద్దామని చెప్పినా ఆయన వినలేదని తెలిపారు. పాట బాగుందంటూ చిరంజీవి పెట్టిన పోస్టుకు బదులిస్తూ.. షూటింగ్ జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు."ఆ రోజు ఇంకా గుర్తుంది సర్. ఈ బీజీఎం (పాటలోని నేపథ్య సంగీతం) షూటింగ్ చేస్తున్నప్పుడు చరణ్‌కు తీవ్ర జ్వరం. మేం షూటింగ్ ఆపేద్దామన్నా.. ఆయన 'లేదు చేద్దాం' అని అన్నారు. అంత జ్వరంలోనూ చిరునవ్వుతో, ఎంతో గ్రేస్‌తో డ్యాన్స్ చేశారు. ఆ డెడికేషన్ అన్నీ మీ నుంచి వచ్చినవే సర్" అని బుచ్చిబాబు పేర్కొన్నారు.'రై రై రారా' సాంగ్ స్క్రీన్‌పై ఓ ఫైర్‌లా ఉందంటూ చిరంజీవి పోస్టు పెట్టారు. అది ఎనర్జీ, ఎమోషన్‌లతో కూడిన అద్భుతమని కొనియాడారు. చరణ్ గ్రేస్, డ్యాన్స్‌లో వేగం చూస్తుంటే ఎంతో గర్వంగా ఉందన్నారు. సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్, గేయ రచయిత అనంత శ్రీరామ్, కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్, దర్శకుడు బుచ్చిబాబు, సినిమాటోగ్రాఫర్ రత్నవేలు, నిర్మాత వెంకట సతీశ్ కిలారులను చిరంజీవి ప్రత్యేకంగా అభినందించారు. ఉత్తరాంధ్ర నేపథ్యంతో స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా ఏప్రిల్ 30న విడుదల కానుంది.

# భాగ్యశ్రీ గ్లామర్ విందు!

ఇటీవల సోషల్ మీడియాను షేక్ చేస్తున్న పేర్లలో భాగ్యశ్రీ బోర్సే ఒకటి. తాజాగా ఈ బ్యూటీ పోస్ట్ చేసిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా బాడీ హగ్గింగ్ ఫ్రాకులో భాగ్యశ్రీ కనిపిస్తున్న తీరు అభిమానుల మతి పోగొడుతోంది. అదిరిపోయే ఫిజిక్‌తో, మతి చెడే అందంతో కవ్విస్తున్న భాగ్యశ్రీ.. తన గ్లామర్ విందుతో కుర్రకారుకు కునుకుపట్టనివ్వకుండా చేస్తోంది. సోషల్ మీడియాలో షేర్ చేసిన ఈ మైండ్ బ్లోయింగ్ ఫోటోషూట్ పై యూత్ కామెంట్లతో విరుచుకుపడుతున్నారు. భాగ్యశ్రీ కేవలం అందంతోనే కాదు, తన కిల్లర్ లుక్స్, కాన్ఫిడెంట్ మూవ్స్‌తో ఇండస్ట్రీలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. కెమెరా ముందు ఈ భామ పలికించే హావభావాలు, గ్రేస్‌ఫుల్ కదలికలు ప్రేక్షకులను కట్టిపడేస్తున్నాయి. వెండితెరపై భాగ్యశ్రీ అందం, డ్యాన్స్ మూవ్స్ ఇప్పటికే సినీ ప్రియులను ఆకట్టుకున్నాయి. తనదైన శైలిలో కిల్లర్ పెర్ఫార్మెన్స్‌తో కట్టి పడేస్తున్న ఈ బ్యూటీ మునుముందు రోజుల్లో స్టార్ హీరోయిన్‌గా ఎదగడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.అందానికి అందం, దానికి తోడు చక్కటి నటనా ప్రతిభ తో భాగ్యశ్రీ బోర్సే టాలీవుడ్‌లో రాకెట్ లా దూసుకెళుతోంది. తనలోని ఎనర్జీ, స్క్రీన్ ప్రెజెన్స్ మేకర్స్‌ను బాగా ఆకట్టుకుంటోంది. అందుకే బాక్సాఫీస్ ఫలితాల కంటే కూడా ఈ బ్యూటీ నటనకే ఎక్కువ మార్కులు పడుతున్నాయి. ఫలితంగా క్రేజీ ప్రాజెక్టులు తలుపు తడుతున్నాయి.రామ్ పోతినేని సరసన నటించిన `ఆంధ్రా కింగ్` చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయినప్పటికీ, భాగ్యశ్రీకి మాత్రం మంచి పేరు తెచ్చిపెట్టింది. ఆ సినిమాలో ఆమె గ్లామర్ మరియు ఎనర్జీ లెవల్స్ ప్రేక్షకులకు బాగా నచ్చాయి. దీంతో సినిమా రిజల్ట్‌తో సంబంధం లేకుండా భాగ్యశ్రీ సేఫ్ జోన్‌లోకి వెళ్ళిపోయింది. ముఖ్యంగా రామ్ వంటి ఎనర్జిటిక్ హీరోతో పోటాపోటీగా నటించడం ఆమె కెరీర్‌కు ప్లస్ పాయింట్‌గా మారింది.ఇక వ్యక్తిగత విషయానికి వస్తే... గత కొంతకాలంగా రామ్- భాగ్యశ్రీ మధ్య లవ్వాయణం సాగుతోందని సోషల్ మీడియాలో గుసగుసలు వినిపిస్తున్నాయి. వీరిద్దరూ ప్రేమలో ఉన్నారా లేరా అన్నది ఇప్పుడు పెద్ద సస్పెన్స్‌గా మారింది.






# గిరిజన గడ్డపై మిన్నంటిన హోలీ సంబరాలు

**ఉమ్మడి జిల్లాలో అంబరాన్నంటిన హోలీ సంబురాలు**
**ఉత్సాహంగా పాల్గొన్న ఎస్పీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు**
**నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్న నేతలు**

## రంగుల జాతరలో తడిసిముద్దయిన జనం





**ఆదిలాబాద్ బ్యూరో, మార్చి 3 (ప్రభాత సమాచారం)**

రంగుల కేలి హోలీ పండుగ వేడుకలు జిల్లావ్యాప్తంగా ఆనందోత్సవాల మధ్య జరిగాయి. మంగళవారం ఉదయం నుండే ఆదిలాబాద్ జిల్లా కేంద్రం తో పాటు వివిధ మండలాల్లో యువతి, యువకులు, చిన్నారులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా హోలీ పండుగను జరుపుకున్నారు. యువకులు కేరింతలు కొడుతూ, డిజె సౌండ్ సిస్టం అనుగుణంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ప్రజా ప్రతినిధులతో పాటు ఆయా రాజకీయ పార్టీల నేతలు, జిల్లా ఉన్నతాధికారులు రంగుల్లో మునిగి తేలుతూ ఆనందోత్సవాల మధ్య నృత్యాలు చేస్తూ పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ తమ బీజేపీ పార్టీ శ్రేణులతో కలిసి ఉత్సాహంగా హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే శంకర్ ఉదయమే తమ కుటుంబ సభ్యులతో కలిసి హోలీ పండగను జరుపుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన హోలీ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేకు పార్టీ శ్రేణులకు రంగులు పూసారు. ఈ సందర్భంగా బ్యాండ్ మేళాలకు అనుగుణంగా పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే నృత్యాలు చేస్తూ అందరినీ ఉత్సాహ పరిచారు. అదేవిదంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సైతం హోలీ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జరిగిన హోలీ వేడుకల్లో ఎస్పీ తో పాటు ఏఎస్పీ మౌనిక, ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మట్, డీఎస్పీ జీవన్ రెడ్డి తదితరులు పోలీస్ లతో కలిసి హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. పలువురు పోలీసులు ఎస్పీకి రంగులు పూసి హోలీ శుభాకాంక్షలు. పలువురు పోలీసులు జిల్లా ఎస్పీని భుజాలపై ఎత్తుకొని చేస్తూ ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ, పండగ వేడుకలను జరుపుకున్నారు. అటు మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న సైతం హోలీ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఊరి వేడుకల్లో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి జోగు రామన్న కు రంగులు పూసి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు ఆదిలాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ హోలీ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. భుక్తాపుర్ కాలనీ వసూలు, మహిళలతో కలిసి చైర్పర్సన్ హోలీ వేడుకల్లో పాల్గొని, ఒకరికొకరు రంగు లు చల్లుకుంటూ ఆనందోచాల మధ్య హోలీ వేడుకలు జరుపుకున్నారు. అదేవిధంగా మున్సిపల్ కార్మికులు సైతం ఛైర్పర్సన్‌కు రంగులు పూసి హోలీ పండగ శుభాకాంక్షలు తెలిపారు. నిర్మల్ జిల్లాలో మంగళవారం పోలీ సంబురాలు ఘనంగా జరిగాయి. జిల్లా కేంద్రంతో పాటు ఖానాపూర్ భైంసా బాసర కుంటాల దిల్వార్పూర్ కడెం సారంగాపూర్ మామిడాల లక్ష్మణ చందా తదితర మండలాల్లో హోలీ సంబురాలు ఘనంగా నిర్వహించారు. యువకులు మహిళలు చిన్నారులు ఒకరిపై ఒకరు రంగులు పూసుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నిర్మల్ పట్టణంలో మున్సిపల్ చైర్పర్సన్ అప్పల కావ్య గణేష్ చక్రవర్తి తన కుటుంబ సభ్యులతో కలిసి హోలీ సంబరాలు జరుపుకు న్నారు. నిర్మల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో పోలి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భైంసా పట్టణంలో హిందు వాహిని ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించగా నిర్మల్ జిల్లా కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ హిందూ వాహిని ఆధ్వర్యం లో హోలీ ర్యాలీ నిర్వహించారు. ఈ వేడుకలలో ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పాల్గొన్నారు టీఎన్జీవో పంచాయతీరాజ్ ఇంజనీర్లు ఎస్‌టియు టీఎస్ ఉపాధ్యాయ సంఘం పిఆర్టియు పిఆర్‌టియుటిఎస్ సంఘాల ఆధ్వర్యంలో హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భైంసా పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల నిర్మల్ పట్టణంలోని బీసీ గురుకుల పాఠశాల సోఫినార్ గురుకుల పాఠశాలలో హోలీ సంబరాలు జరుపుకున్నారు. హోలీ సందర్భంగా పట్టణంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు పోలీసులు నిరంతరం తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు శ్రీధర్ లక్ష్మణ్ ఎస్టియు జిల్లా అధ్యక్షులు భూమున్న యాదవ్ స్థానిక నాయకులు పాల్గొన్నారు కుబీర్, తానూర్ మండలాలు మంగళవారం హోలీ సంబరాలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయా గ్రామాల్లో ఉదయం నుండి ఒకరిపై ఒకరు రంగులు పూసుకొని హ్యాపీ హోలీ అంటూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో హోలీ ఉత్సవ ర్యాలీలను నిర్వహించా రు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో మంగళవారం హోలీ పండుగను ఘనంగా నిర్వహిం చారు. ఎస్పీ జానకి షర్మిల ఏఎస్పీలు ఉపేందర్ రెడ్డి సాయికుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఒకరిపై ఒకరు రంగులు పూసుకొని హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ జానకి షర్మిల బ్యాండ్ వంచి నృత్యాలు చేశా రు. పండుగలు ఆనందాన్ని ఇస్తాయని తెలిపారు. ఈ కార్యక్ర మంలో జిల్లా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ప్రజలు మంగళవారం ఆనందోత్సవాల మధ్య ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. హోలీ వేడుకల్లో చిన్నాపెద్ద తేడా లేకుండా ప్రజలు పరస్పరం రంగులు చల్లు కుంటూ శుభాకాంక్షలు తెలుపుకు న్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా, కాలనీలలో యువత సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసుకుని సందడి చేస్తూ వేడుకలను జరుపుకున్నారు. సహజ సిద్ధ రంగు లతో పండుగను నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంప్ కార్యాల యం లో ఎస్పీ నితిక పంత్ సిబ్బందితో కలిసి ఉత్సాహంగా వేడు కల్లో పాల్గొన్నారు. నృ త్యం చేస్తూ అందరిని ఆకట్టుకు న్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ కుటుం బ సభ్యులతో పాటు సిబ్బందితో కలిసి వేడుకల్లో పాల్గొ న్నారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి తన నివాసం వద్ద వేడుకలు జరుపుకుని నియోజకవర్గ ప్రజలందరికీ హోలీ శుభాకాం క్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, కాగజ్నగర్లో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోలీ పండుగ సమాజంలో ఐక్యత, సోదరభావం, పరస్పర స్నేహాన్ని పెంపొందించే పండుగగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. హోలీ పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.










# గోదావరి పుష్కర ఘాట్ వద్ద పకడ్బందీ ఏర్పాట్లు



**మంచిర్యాల, మార్చి 3 (ప్రభాత సమాచారం)**

గోదావరి నది పుష్కర ఘాట్ వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేసు_న్నట్లు పెద్దపల్లి డిసిపి రామ్ రెడ్డి అన్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు మంగళవారం గోదావరిఖని సబ్ డివిజన్, మంచిర్యాల జిల్లా నది పరివాహక ప్రాంతం గోదావరి పుష్కర ఘాట్ వద్ద నిర్వహిస్తున్న పనులను పరిశీలించారు. గోదావరి బ్రిడ్జి సమీపంలో పుష్కర ఘాట్ ను పరిశీలించి వివరాలు సేకరించి అధికారులకు పలు సూచనలు చేశారు. గోదావరి తీరం వద్ద పుష్కర స్థానాలకు వచ్చి వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. గోదావరిఖని, మంచిర్యాల జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పుణ్య స్థానాలు చేసేందుకు వచ్చే అవకాశం ఉన్నందున బ్రిడ్జి వద్ద పోలీసు భద్రత, బ్యారేడింగ్, సీసీ కెమెరాల పనితీరు, ట్రాఫిక్ మళ్లింపు, లైటింగ్ సౌకర్యం, వాహనాలు పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లను అధికారులతో కలిసి పలు సూచనలు చేశారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా పుష్కర ఘాట్ వద్ద సౌకర్యాలు కల్పించాలన్నారు. అత్యవసర పరిస్థితుల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పుష్కర ఘాట్ ఏర్పాట్లను అధికారులు దగ్గరుండి పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిసిపి వెంట గోదావరిఖని ఏసిపి రమేష్, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాద్ రావు, ఎస్సై వెంకట్ పాల్గొన్నారు.

# విద్యుత్ వ్యవస్థ రక్షణకు లైట్నింగ్ అరెస్టర్లు



## సూపరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే

**ఆసిఫాబాద్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**

వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో మెరుపులు, పిడుగుల కారణంగా విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లకు నష్టం కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు ఉత్తమ్ జాడే తెలిపారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను రక్షించేందుకు కీలక ప్రాంతాల్లో లైట్నింగ్ అరెస్టర్లు ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే 80 లైట్నింగ్ అరెస్టర్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. లైట్నింగ్ అరెస్టర్ అనేది మెరుపు పిడుగు వల్ల ఉత్పన్నమయ్యే అధిక వోల్టేజ్‌ను భూమిలోకి సురక్షితంగా మళ్లించే రక్షణ పరికరమని ఆయన వివరించారు. దీని ద్వారా ట్రాన్స్‌ఫార్మర్లు, స్విచ్‌గియర్ పరికరాలు తదితర విద్యుత్ యంత్రాంగం సురక్షితంగా ఉండడంతో పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గుతాయని తెలిపారు. మెరుపుల కారణంగా జరిగే బ్రేక్‌డౌన్లు కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్నారు. వర్షాకాలంలో వినియోగదారులు కూడా జాగ్రత్తలు పాటించాలని సూచించిన ఆయన, ఇంటి విద్యుత్ పరికరాలకు సర్జ్ ప్రొటెక్టర్లు వినియోగించడంతో పాటు మెరుపులు, పిడుగుల సమయంలో అనవసరంగా విద్యుత్ పరికరాలను తాకకుండా ఉండాలని సూచించారు. నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా విద్యుత్ శాఖ పనిచేస్తోందని తెలిపారు.



# బాల్క సుమన్‌కు కోర్టులో ఊరట

### బెయిల్ మంజూరు చేసిన చెన్నూర్ న్యాయస్థానం

### ఆదిలాబాద్ జైలు నుంచి నేడు విడుదలయ్యే అవకాశం

**ఆదిలాబాద్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**

చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు కోర్టులో ఊరట లభించింది. చెన్నూర్‌లో నమోదైన కేసులో చెన్నూర్ కోర్టు న్యాయ మూర్తి బెయిల్ మంజురు చేస్తూ తీర్పుని చ్చారు. ఇప్పటికే మంచిర్యాల, రాయదుర్గం ఈ రెండు కేసుల్లో బెయిల్ మంజూరు కాగా, తాజాగా చెన్నూర్ కేసులో బెయిల్ మంజూరైంది. దీంతో ఈ మూడు కేసుల్లో రిమాండ్ ఖైదీగా ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉన్న బాల్క సుమన్ బుధవారం ఉదయం విడు దల కానున్నారు. చెన్నూర్ మున్సిపల్ ఎన్ని కల పోలింగ్ రోజు పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద బాల్క సుమన్ ధర్నా చేపట్టినం దుకు కేసు నమోదు చేసి సంగతి తెలిసిందే. ఈ కేసులో సుమన్ తరఫు న్యాయవాది వాదనలు విన్న జూనియర్ సివిల్ జడ్జ్ బాల్క సుమన్‌కు బెయిల్ మంజూరు చేస్తూ తీర్పునిచ్చారు. అదేవిధంగా క్యాతనపల్లి ము న్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా రాళ్లదాడి కేసులో సుమన్ అరెస్ట్ అయి గత నెల 18 నుంచి ఆదిలాబాద్ జిల్లా జైల్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ కేసులో మంచిర్యాల జిల్లా కోర్టు గత రెండు రోజుల క్రితమే బెయిల్ మంజూరైంది. రాయదుర్గం కేసులో సైతం బెయిల్ మంజూరైంది. దీంతో మొత్తం మూ డు కేసుల్లోనూ బాల్క సుమన్‌కు బెయిల్ మంజూరైంది.



# పునరావాస భూముల వద్ద ఉద్రిక్తత

**కడెం, మార్చి 3 (ప్రభాత సమాచారం)**

కడెం మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ సమీపంలోని వ్యవసాయ భూముల వద్ద స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. మైసంపేట పునరావాస గ్రామానికి కేటాయించిన వ్యవసాయ భూముల వద్ద గోండు గూడ, మైసంపేట గ్రామస్థులు హోలీ సందర్భంగా పూజలు చేయడానికి వెళ్లారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ భూములు మావంటే మావంటూ ఇరు వర్గాల ప్రజలు వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు, ఫారెస్ట్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని ఇరువురికి సద్దిచెప్పారు. అయితే ఈ భూములకు సంబందించి గతంలో కూడా ఆందోళనలు జరగడంతో అధికారులు ఆ భూములను పంపిణీ చేసే క్రమంలో ఇబ్బందులు పడుతున్నారు.

# అక్రమ గోవుల రవాణా భగ్నం

**లక్షెట్టిపేట, మార్చి 3 (ప్రభాత సమాచారం)**

ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా పశువులను తరలిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా మూడు బోలెరో వాహనాలను అదుపులోకి తీసుకుని, ముగ్గురు డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపతి సురేష్ మంగళవారం తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం, మంచిర్యాల వైపు నుంచి కరీంనగర్ చౌరస్తా వైపు వెళ్తున్న మూడు వాహనాల్లో 12 పశువులను అక్రమంగా తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో వాహనాలను తనిఖీ చేయగా 12 పశువులను స్వాధీనం చేసుకుని, వాహనాలను సీజ్ చేశారు. ముగ్గురు డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# ఎరుపు రంగు పులుముకున్న చందమామ

### ఖగోళ అద్భుతం - నింగిలో వింత ఆవిష్కారం

### 'బ్లడ్ మూన్'తో కనువిందు చేసిన 2026 తొలి చంద్రగ్రహణం!

### మైమరచి చూసిన ఖగోళ ప్రేమికులు.

### మధ్యాహ్నం 3:20 నుండి సాయంత్రం 6:47 వరకు గ్రహణం

**ఆదిలాబాద్, మార్చి 3 (ప్రభాత సమాచారం)**

2026 సంవత్సరపు మొదటి ఖగోళ అద్భుతం నేడు ఆవిష్కృతం అయింది. మార్చి 03, 2026న ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాలతో పాటు భారతదేశంలోనూ చంద్రగ్రహణం ఏర్పడింది. ఈ అరుదైన దృశ్యాన్ని ఖగోళ ప్రేమికులు ఆసక్తిగా తిలకించారు. ఎరుపు రంగులో చంద్రుడు కనువిందు చేశాడు. మంగళవారం మధ్యాహ్నం 03:20 గంటలకు ప్రారంభమైన గ్రహణం.. సాయంత్రం 06:47 గంటలకు ముగిసింది.



విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
సయ్యద్ కరీం, ఎడిటర్ - ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY